# కీ



2004



'ఆ తోటలోనొకటి ఆరాధనాలయం... ఆ ఆలయంలోని అందగాడెవరే!' అంటూ - ఈ తోటలోనున్న అందగాడిమీద మనసు పారేసుకున్న ఒకానొక దేశపు చిన్నది - చివరకు - ఆ అందగాడిని మనువాడి - కోటి కోరికలతో ఈ దేశంలో అడుగెట్టింది!

కొత్తకోడలికి హారతులతో స్వాగతం పలికారు అత్తగారు. తోటి కోడళ్లు మాత్రం... 'వచ్చింది తమ బంధువుల పిల్లకాదు - పరాయి పిల్ల!' అని మూతి విరిచారు!

'పరాయి పిల్లయితేనేం ? ఇంట్లో పనులన్నీ ఎంచక్కా చక్కబెడుతోంది! మంచి

పనిమంతురాలు!' అని మురిసిపోయారు ఆడపడుచులు!

అందర్తో కలవిడిగా తలలో నాలుకలా మసులుకున్న ఆమె రాన్రానూ అత్తగారి మనసూ, ఆడపడచుల మనసూ చూరగొంది! ఇద్దరి పిల్లలకి తల్లి కూడా అయింది!

కొన్నాళ్ళు గడిచాయి!

ఏమరిపాటున ఉన్న వాళ్ళ అత్తగారు పనివాళ్ళ చేతుల్లో ప్రాణాలు పోగొట్టుకున్నారు! ఆడపడచులందరూ కలిసి - కోడలు వద్దని వారిస్తున్నా వినకుండా - బలవంతంగా ఆ ఇంటి 'తాళంచెవి'ని కొడుక్కి అప్పగించారు!

ఎంతో అన్యోన్యంగా సాగిన వారి సంసారంలో - ఊహించని సంఘటన చోటు చేసుకుంది! తల్లిలాగే - మరో ప్రమాదంలో ప్రాణాలు పోగొట్టుకున్నాడు కొడుకు!

అలా వెన్వెంటనే జరిగిన రెండు అకాల మరణాలకి తట్టుకోలేక 'ఆ తాళం చెవి' ఈసారి కోడలికి ఇవ్వాలని తీర్మానించుకున్నారు ఆడ పడచులు!

అప్పుడు మొదలయింది అసలు గొడవ!

'నువ్వా 'పక్కింటి' దానివి!- మేమా 'ఒక్కింటి' వాళ్ళం! పరాయి దానివి.... నిన్ను నమ్మి - మా ఇంటి తాళం చెవి నీకెలా ఇచ్చేది?' పేచీ పెట్టారు తోటికోడళ్ళు.

'చట్ట ప్రకారంగా ఆమె ఈ ఇంటికోడలై - మా ఇద్దరికీ జన్మనిచ్చి - ముప్ఫై ఏళ్ళుగా ఈ ఇంట్లోనే ఉంటోంది! - ఇంకా ఆమె పరాయి మనిషేమిటి- అబ్సర్డ్!' విస్తుపోయారు కన్న పిల్లలు.

'అదంతే! రేపు ఆమె తన పుట్టింటికి వెళ్ళిపోతుందేమో!? మన ఇంటి తాళం చెవిని ఆమెకి అప్పగిస్తే - వెళ్తూ వెళ్తూ మన ఇనప్పెట్టెలోని డబ్బూ, దస్కం ఎత్తుకుపోతుందేమో?' అనుమానం వెలిబుచ్చారు తోటి కోడళ్ళు.

'అదేమిటి? - ఎంత అన్యాయం? మీ దృష్టిలో - ఈ ఇంట్లో మా అమ్మ స్థానం- కేవలం పిల్లల్ని కని పారెయ్యడానికి మాత్రమే- పనికొచ్చే యంత్రమా? ఆమెకో వ్యక్తిత్వం లేదా ? ఆమె ఈ ఇంట్లో 'ఊడిగం' చేయడానికే తప్ప అధికారం చెలాయించడానికి 'అర్హత' లేని మనిషా?' పిల్లల మనసు కుతకుతా ఉడికిపోతోంది!

'ఆ రోజు మీ నాన్నకి చిలక్కి చెప్పినట్టు చెప్పాం ! ఈ సంబంధం వొద్దురా అంటే విన్నాడు కాదు! ప్రేమా ప్రేమంటూ పక్కింటి పిల్లని పెళ్ళాడాడు! వాడు మేనరికం చేసుకునివుంటే - ఇప్పుడు మీకీ కష్టాలు వచ్చేవా?' సానుభూతి నటించారు... ఆ పిల్లల పిన్నమ్మలు.

'అసలు ఇలాంటి అనుమానప్పిశాచులు - విదేశీ మహిళల్ని పెళ్ళి చేసుకోవద్దనే 'కట్టడీ' చేసుకుని - అన్నీ మేనరికాలే చేసుకుంటే సరిపోయేదిగా - ఇలా పరాయి గడ్డమీది ఆడపిల్లల ఉసురుపోసుకునే బదులు!'

చీదరించుకున్నారు జరుగుతోన్న తంతంతా వింతగా చూస్తోన్న ఇరుగు పొరుగు వాళ్ళు.

'అబ్బో ఇంటి తాళం చెవి మీ అమ్మకి అప్పగిస్తే ఇంకేమన్నా ఉందా? ఇంటి రహస్యాలు ఆమె తన పుట్టింటికి చేరవేస్తుంది! వాళ్ళ పుట్టింటి వాళ్ళు - మనింటి మీదికొస్తే - మన కొంప కొల్లేరవుతుంది!' గుండెలు బాదుకున్నారు తోటికోడళ్ళు!

'ఛ! నమ్మకంలేని చోట - తప్పించుకోలేని సేవలేమిటి... తనవి?' ఈటెల్లా తగుల్తోన్న మాటలు వింటూ పేలవంగా నవ్వుకుంది ఆమె.

జరుగుతోన్న పరిణామాల పట్ల నిశ్చేష్టులై నిలబడిపోయిన ఆడ పడచుల గుండెలు అవిసిపోయాయి! కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. పట్టుదల పెరిగింది. తాళం చెవి ఆమెకే ఇవ్వాలని తీర్మానించుకున్నారు.

'ఇంతదాకా వచ్చి - మీరిప్పుడు తప్పుకుంటే - అది మీ ఆత్మ గౌరవానికి భంగం కాదా?' ఆడపడచుల మనసు ఆక్రోశించింది.

'మా ఇంటి గౌరవం కన్నా - ఆమె 'ఆత్మగౌరవం' అంత ముఖ్యమైందేం కాదు!' అంటూ ఇంటి వంశ ప్రతిష్ఠల చిట్టా విప్పారు తోటికోడళ్ళు.

పిల్లల పిడికిళ్ళు బిగిసుకున్నాయి!

'అసలు... ఆ తాళం చెవి కొరకు ఏడుస్తోందెవరు ? మా అమ్మకి కావలసింది... ఈ అధికారాలూ - పెత్తనాలూ కాదు! మాతో, మా నాన్న జ్ఞాపకాలతో ఈ ఇంట్లో ప్రశాంతంగా గడపడం! మాకు ఏ అధికారాలూ వద్దు' అంటూ మేనత్తల చేతుల్లో ఉన్న తాళంచెవి లాక్కుని - విసిరివేయడానికి చెయ్యెత్తారు పిల్లలు!

ఆమె తన పిల్లలని వారించి - ఆ తాళం చెవిని కళ్ళకద్దుకుని- ఎవరూ ఊహించిన రీతిలో - అందరి సమక్షంలో - దాన్ని తన మరిది చేతుల్లో పెట్టి - రంగం నుండి తప్పుకుంది... ఎంతో హుందాగా.

అప్పటిదాకా 'ఆమె తాళం చెవి ఇవ్వదు గాక ఇవ్వదు' అని ఆ విషయంలో పందాలు వేసుకుని - గగ్గోలు సృష్టించి, నానా హంగామా చేసి - హింసిద్దామని కాచుక్కూర్చున్న వాళ్ళకి .. సమస్య అంత 'సులువు'గా పరిష్కారం కావడం - ఆశాభంగం కలిగించింది!

ఎప్పుడూ ఎవర్నో ఒకర్ని పొడవందే - కరవందే పొద్దుపోని మనుషులు కదా కొందరు! దెబ్బ తగిలిన వాళ్ళు... ఆ గాయాలతో విలవిల్లాడుతూ - గిలగిలా కొట్టుకుంటూంటే - గలగలా నవ్వుకునే పైశాచిక ప్రవృత్తి కదా మనుషులది!

అందుకే - ఈసారి కొత్త అస్త్రాలు సంధించేందుకు సిద్ధమయ్యారు!

'అబ్బో! తాళం చెవి ఇచ్చినట్టే ఇచ్చి - మరిది చాటున మళ్ళీ తానే అధికారం చెలాయించవచ్చని ఆశ! అబ్బ - ఏం ఎత్తు - ఏం ఎత్తూ!?'.... అంటూ కుళ్ళబొడిచారు!

‘త్యాగం ముసుగులో... ఎంత తెలివీ! ఏం తెలివీ!’... అంటూ పీక్కుతిన్నారు!

అలా కోడిగుడ్డుకు ఈకలు పీకే కార్యక్రమాన్ని - అమితోత్సాహంగా- భుజాలకెత్తుకున్నారు!

★★★★★

అవునూ.... మనకి హింస... చిత్రహింస.... గృహహింస... ఇవన్నీ తెలుసు కదా-

మరి -

పుట్టిన దేశం వదిలి - నచ్చినవాడ్ని కట్టుకుని - కట్టుబట్టల్తో పర దేశంలో కాలెట్టిన విదేశీ మహిళ పట్ల -

ఆమెకి పౌరసత్వం వచ్చాక కూడా ఇంకా - ‘ఆమె... స్వదేశీ కాదు విదేశీ’ అంటూ చూపించే వివక్ష....

విదేశీ కోడళ్ళపై - స్వదేశీ వేధింపులు...

నిజానికి ఏ హింస కిందికి వస్తాయో... దీనికి ఎవర్ని శిక్షించాలో - బాధితుల్ని ఎలా రక్షించాలో... ఆలోచించక పోవడమే విడ్డూరం!

గ్లోబలైజేషన్‌లో ప్రపంచమే ఓ కుగ్రామం అవుతోన్న ఈ రోజుల్లో..... వసుధైక కుటుంబంలో - ఓ వసుధను అనుక్షణం అనుమానించడం- అవమానించడం, అవహేళన చేయడం... బాధితుల పట్ల... క్షమార్హంగాని మన ‘ఉపేక్ష’కి సంకేతం కాదా?

**అంకితం**

ఆ విదేశీ కోడలికి.....

-క్షమాపణలతో....